# జన్మహక్కు

శ్రీ 'మాను'

★

మధ్యాహ్నపు ఎండనీ దక్కను పీఠ భూమినీ చీల్చుకొని వడివడిగా అనేక వందల ప్రాణులను మోసుకొని బొంబాయి మెయిల్ విసురుగా పోతోంది. అమ్మ చీరచెంగు పట్టుకుంటేనే పాప తప్పిపోకుండా మళ్ళీ ఇల్లు చేరుకోగలిగినట్లు... ఆ రైలుపెట్టెల్లో దేంట్లోనో ఇరుక్కుంటేనే—కోటి ఆలోచిస్తూ నవ్వుకున్నాడు—బొంబాయి చేరుకోగలడు! చుట్టూ స్నేహితులు బాతాఖానీ వేశారు. దూరాన కనిపిస్తున్న చెట్లూ కొండలూ వెనక్కు పరుగెడుతున్నాయి. చిన్ననాడు పాఠంలో నేర్చుకున్నట్లు భూమి గుండ్రంగా ఉందని నిరూపించడం ఎల్లా అని కోటి శ్రమ పడుతున్నాడు.

"మాశారా..." వెనకనుంచి ఎవరో ఎవరితోనో నవ్వుతూ హిందీలో చెపుతున్నాడు..."యీ రైలుబద్దీలకు రెండు వైపులా కంచె కట్టివేశారు. కారణం తెలుసా? దీనికి కుడివైపు భాగం నైజాం నవాబుది. ఎడమవైపు భాగం బ్రిటిష్ వాడిది. కాదుకాదు మరిచాను మనదీనూ..."

కోటి తల వెనక్కు తిప్పకుండానే ఆలోచిస్తున్నాడు. "స్వాతంత్ర్యం తెచ్చిన వెన్నో బాధ్యతలు..."

"నైజాంలో నలుగురు స్త్రీల మానభంగం..." "నల్లగొండ తాలూకాలో కమ్యూనిస్టువీరుని బలి..." "పోలీసులు గ్రామాలు గ్రామాలనే దోచుకుంటున్నారు..."

వెనుకనుండి పేపరు హెడ్డింగ్సు చదువుతున్నాడు గోపాలరావు.

తనదేశం తిండి, గుడ్డ లేకుండా బాధ పడుతోంది. ఇతరదేశాల్లో ప్రజలంతా ఈనాడు ఎలక్ట్రిక్ రైళ్ళలో ప్రయాణం చేస్తుంటే...తన దేశస్థులు ఇంకా బొగ్గురైళ్ల లోనే ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. మొన్న ప్రభుత్వం కొత్తగా నడుపదలచుకొన్న 'సిల్వర్ యారో' గ్రామాల్లోంచి పోతుంటే...పాపంబీదప్రజలు...విరగబడి చూశారు...ఇంతకీ అదీ బొగ్గుబండే!

దూరాన యెవరో రైతు పొలంగట్టు మీద నిలబడి ఎండకి చెయ్యి అడ్డుపెట్టుకుని రైలును మాసి గట్టిగా ఆవులించాడు. వెనకనుంచి గోపాలం పేపరు చదివి వినిపిస్తున్నాడు.

మొన్న ఒక రాజకీయ నాయకుడు మాట్లాడుతూ అన్నమాటలు జ్ఞాపకానికొచ్చాయి.

"స్వాతంత్ర్యం రావడమంటే ఈనాడు ప్రజలకష్టాలు పోగొట్టే ప్రభుత్వం గాలేదని మనకి తెలుసు. తెల్లనాయకత్వంపోయి నల్ల నాయకత్వం అధికారంలోకి వచ్చింది. కార్మికులు సమ్మెలు యెందుకుచేస్తారో

అర్థంచేసుకోలేని గుడ్డిప్రభుత్వం ప్రజా ప్రభుత్వంఎలా అవుతుంది?....తను గద్దిమీద వుండగా ఎవరూ తనని ఏమీ చెయ్యలేరని అహంకారం..ఈనాడు ప్రజలంటే ఎవరూ అనొచ్చు ప్రభుత్వం...కాని రేపు..."

"ఎన్. జి. ఓ లపై ప్రభుత్వం పగ సాధించరాదు"

దూరాన యెవరో అందుకున్నారు: "అసలు వీళ్ళని సమ్మె చెయ్యమన్నది ఎవరు...యీవేళ పగ సాధించరాదని ప్రాధేయపడమన్నది ఎవరు ?"

కోటి రివ్వున వెనక్కు తిరిగాడు... "కడుపులో మండే ఆకలి వాళ్ళని సమ్మె చెయ్యమంది...ఇంట్లో మాడుతున్న పెళ్లాం బిడ్డలు సమ్మె చెయ్యమన్నారు. మందు లేకుండా ఎన్నాళ్ళకూ నయంకాని కొడుకుల జబ్బులు గుమాస్తాలను సమ్మె చెయ్యమన్నాయి. యీనాడు మధ్యతరగతి కుటుంబాలు అన్నం తింటున్నాయి అనుకుంటున్నారేమిటీ? పొరపాటు...మర్యాదకు మీతో చెప్పటంలేదు కాని..."

వింటూ వింటూ బీడీ వెలిగించాడా వ్యక్తి.

"ఈనాడు తమ ప్రభుత్వం వచ్చింది కనక నోరువిడిచి అడిగారు. నేను వోటు వేస్తే అధికారంలోకి వచ్చిందిఈప్రభుత్వం. ఇంకా కుర్చీలు యెక్కకముందే స్టేట్‌మెంట్లిచ్చారు...నేను ఇదిచేస్తాను...అది చేస్తాను అంటూ......ఇప్పుడొక్కరూ మాట్లాడరేం ?"

"ఎందుకు? తన అవసరం తీరిపోయింది కనక..."

"అన్నం పెట్టమన్నాడు గుమాస్తా... సున్నం పెడతానంది ప్రభుత్వం... జీసస్ అన్నాడు వెర్రివాడు కనక... ఏ తండ్రి అయినా కొడుకు రొట్టె అడిగితే రాయి యిస్తాడా అని... తెలియదు జీసస్‌కి మన ప్రభుత్వం వుందని..."

తన పేపరు హడావుడినుంచి తేరుకుంటూ అడిగాడు గోపాలం: "దేని విషయం మాట్లాడుతున్నారు? నైజాం గురించా ?..."

కోటి ఆలోచనలోపడ్డాడు... నైజాం విషయం తలుచుకుంటే గుండె దడదడలాడుతోంది. ప్రజలను నిలువునా చిత్రవధచేస్తున్నారు.

సాయంకాలం సూర్యుడు క్రుంగి పోతున్నాడు. పొలాలన్నీ నిర్జనంగావున్నాయి రైలుఇంజను నిప్పురవ్వలు ఎగిరిస్తోంది.

"మీరు ఎంతవరకూ వెడతారు" వెనక నుంచి ఎవరో అడుగుతున్నారు.

"బొంబాయి" గోపాలం అంటున్నాడు.

కోటి అనుకున్నాడు— "నిజంగా ఈ రైలు నైజాంకూ, మద్రాసు ప్రభుత్వానికీ మధ్యగా రెండు ప్రభుత్వాలకీ గుణాల్లోను, చర్యల్లోను రాజీచేస్తూ ముందుకు బొంబాయి పోతోంది. వీటి అన్నిటికీ గమ్యస్థానం బొంబాయి కాబోసు..."

"విద్యార్థుల మహాసభ జరుగుతోంది. చాలామంది వెడుతున్నాం. కాశ్మీర్‌నుంచి వస్తున్నారు. మద్రాసునుంచి వస్తున్నారు. మైసూరునుంచి. బెంగాల్‌నుంచి. రాజపుటానానుంచి. ఇంకా... ఇంకా...... చాలామంది"

ఇంత క్రితం సంఘటనః ఒకటి జ్ఞాపకాని కొచ్చింది కోటికి మళ్ళీ. మహబాద్ స్టేషను నైజాం నవాబుది. విద్యార్థులంతా "నైజాం డౌన్ డౌన్" "...నైజాం నశించాలి" అని స్టేషను అదిరిపోయేలా అరగంటసేపు అరిచారు. "మగ్దూం మొహిద్దీన్ జిందాబాద్" అంటుంటే రైల్వే కార్మికులు తెల్లపోయిచూశారు. ఎవరు వీళ్ళు, ఇంత ధైర్యంగా నైజాం నడిబొడ్డుమీద నిప్పు పెడుతున్నారని. పోలీసువాడు తన్ని లాక్కుపోయాడు వాళ్ళని. అనేకవందల మంది నైజాం అభిమానులు ప్లాటుఫారం మీద చేరినా, ఏమీ చేయలేకపోయారు. రైలు కదులుతూంటే ముగ్గురు సి.ఐ.డీ. లను రైలులో ఎక్కించారు తర్వాత స్టేషన్‌లో ప్లాటుఫారంమీద పోలీసు ఆఫీసర్లు గస్తీ తిరగడం ప్రారంభించారు. తెలుసుకున్నారు విద్యార్థులు. ఒక్కడూ మాట్లాడలేదు. రైలు కదిలింది. మళ్ళీ "నైజాంనశించాలి" అని ఒక్కసారిగా నినాదాలు.

"విద్యార్థులు కోతులు." నవ్వుతూ హిందీలో అంటున్నాడు పెట్టెలో ఒకాయన తన భార్యతో.

"చదువుకునేరోజుల్లో మీరూ ఇలాగే ఉండేవారా...?"

"ఈ బడిపంతులు నయ్యాక ఇలా మునిలాగ తయారయాను కాని... నేను చదువుకొనే రోజుల్లోనా!..."

"ప్రస్తుతం బాధపడుతూన్న మనిషి— బుర్రని పది సంవత్సరాలు వెనక్కు లాగి తను మగ్గాకరిమీద ఆధారపడి సుఖంగా బతికినరోజులు జ్ఞాపకం తెచ్చుకొని నోరు ఊటలు ఊరిస్తూ, కళ్ళల్లో జ్యోతులు మెరిపిస్తూ సంతోషంగా మీసాలమధ్య నుంచి చిరునవ్వు వదులుతాడు. ముందేదో నవమహాయుగం రాబోతోందిఅంటే అతను నమ్మమన్నా నమ్మడు" అని నామనస్సు యోచిస్తోంది.

"రాత్రి భోజనం ఎక్కడ" అన్నాడు రామారావు చీకటికేసి చూస్తూ... సెక్రటరీ పక్కపెట్టె లోంచి మా పెట్టెలోకి వచ్చాడు.

కోటి పక్క పెట్టెలోకి తొంగి చూశాడు......విద్యార్థి జండా ఎలక్ట్రిక్ కాంతిలో రెపరెపలాడుతూ గర్వంగా మీకు స్వాతంత్ర్యాన్నీ, శాంతినీ, అభ్యుదయాన్నీ ఇచ్చితీరుతానని హామీయిస్తోంది!

"రాత్రి భోజనం యెక్కడ" మళ్ళీ అడిగాడు రామారావు సెక్రటరీని

ఏదో అన్నాడు సెక్రటరీ...కోటికి వినిపించలేదు, నాకూ వినిపించలేదు. రైలు ఆగిన ప్రతీ స్టేషన్‌లోనూ..."బొంబాయి మహాసభ జిందాబాద్" "షేక్ అబ్దుల్లా జిందాబాద్"

"షేక్ అబ్దుల్లా వస్తాడట వీళ్ళ మహాసభకు......తప్పకుండా వెళ్ళాల్సిందే సుమా..."

"విద్యార్థి ఫెడరేషన్ జిందాబాద్..." "నైజాం దురంతాలు నశించాలి" కోటి కూడా ఉత్సాహంతో స్లోగన్సిచ్చాడు.

రైలు కదిలింది. అందరి ముఖాలవైపు చూశాడు కోటి. నాగభూషణం రెండు చేతుల్లో తలపెట్టుకొని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఎవరో తనకు తెలీని మరో

విద్యార్థి పుస్తకం చదువుతున్నాడు. తీక్షణంగా...

"బొంబాయి వెళ్ళేది తెల్లారి ఎన్ని గంటలకి ?"

కొంతమంది విద్యార్థులు చుట్టూచేరి దేనివిషయమో నవ్వుకుంటున్నారు.

నావైపు చూశాడు కోటి...సిగరెట్టు పొగలో కళ్ళు చిట్లిస్తూ ఏమీ తోచక అతన్నే పరిశీలిస్తున్నాను.

రామకృష్ణ "రైల్వేగైడ్ నిన్ను ఎవరు తియ్యమన్నా"రని చంద్రంతో దెబ్బలాడుతున్నాడు.

నారాయణ "అబ్బబ్బ...సిగరెట్ పొగ..."అని సిగరెట్టుతాగే కులాన్నంతా దుయ్యబడుతున్నాడు.

"మనస్తత్వాలు" అనుకున్నాడు కోటి; చీకటిని చీల్చుకు దూరపు కొండలవైపు చూడడానికి ప్రయత్నిస్తూ...

"రాత్రి అన్నం తినకుండానే నిద్ర పోతావా..." అని అడిగాడు నన్ను కోటి కంట్లోపడిన బొగ్గు నలుముకుంటూ...

నిద్రలో ఏమన్నాడో జ్ఞాపకంలేదు.

*　　*　　*

"పూనా వచ్చింది. ఇక్కడనుంచి ప్రకృతి అతి రమ్యంగా వుంటుంది... లేవండి..." కేకతో అదిరిపడ్డాను...... లేచాను...బెడ్డింగు చుట్టాను.

"రాత్రి అంతా మెళుకువగానే వున్నావా..." అడిగాను కోటిని...

"వచ్చేది పూనాస్టేషన్..."

"రాత్రి అంతా మెళుకువగానే వున్నావా అని అడుగుతున్నాను..."

"ఆ...వచ్చేది పూనాస్టేషన్...... అక్కడనుంచి సీనరీ చాలా బాగుంటుంది...రైలు గుహల్లోంచి పోతుంది. పెద్దపెద్ద ఎత్తైన పర్వతాలమీదనుంచి పోతూంటే రెండు నిలువుల అడవుల లోయలు కనిపిస్తాయి...

"రైలుని బొగ్గు లాగలేదు...ఎలక్ట్రిసిటీతోనే నడుస్తుంది..."వెనకనుంచిఎవరో అంటున్నారు.

"అంతా దాదర్ స్టేషన్‌లో దిగాలి... స్టేషన్ రాగానే బెడ్డింగులు ఎవరివివారు చేత్తో పట్టుకోవాలి..." అంటూ ఎవరో గట్టిగా అరుస్తున్నారు. అంతా బడలికతో ఒళ్లు విరుచుకుంటున్నారు.

"చాలా బడలికగా వుంది...ఇంటికి వెళ్ళగానే స్నానం చెయ్యాలి" అన్నాడు కోటి నవ్వుతూ.

దాదర్ స్టేషన్‌లో రైలు ఆగింది. ఎన్నో వందలమంది విద్యార్థులు రైలు లోంచి దిగుతున్నారు.

"షేక్ అబ్దుల్లా జిందాబాద్...... బాంబే కాన్ఫరెన్స జిందాబాద్..."

తాను కలలుగన్న బొంబాయిలో నడుస్తున్నాడు కోటి...బెడ్డింగులుముందు 'హాల్ గాడీ'లో పోతున్నాయి. కేంప్‌కు ఊరేగింపుగా పోవడానికి వీల్లేదంటున్నాడు వలంటీర్...

విద్యార్థుల్లో కలవరం పుట్టింది.

"ఏం .. ఎందుకు వీల్లేదు..."

"ఊరేగింపులు నిషేధం. సిటీలో 144 పెట్టింది ప్రభుత్వం"

"ఎందుకు..."

"మన మహాసభ కూడా పెట్టుకోనివ్వరేమో!"

అందరి వదనాలూ ఆశ్చర్యం వెలిబుచ్చాయి.

"మతకలహాలున్నాయి ఇక్కడో..."

"మనం 'హిందూ ముస్లిం ఏక్ హో' అంటాం కదూ?"

*   *   *

పదమూడువందల మందితో ఖాల్సా కాలేజీలో జరుగుతూన్న రహస్య(!) సమావేశాలూ, ఉపన్యాసాలూ, చర్చలూ అన్నీ కోటికి ఏదో కలలాగున్నాయి. తను అనేక విద్యార్థిమహాసభలకు వెళ్ళాడు కాని ఇదేమిటి, ఏనిమిత్తమైనా వాళ్లురావచ్చు, సభ వీల్లేదనొచ్చు...

"బహిరంగ సభలు వీల్లేకపోవచ్చు... ప్రభుత్వం నిషేధించవచ్చు... లోపల... ఇంటిలోపల జరుపుకుంటేనేం!"

"పిచ్చివాడా! మతకలహాలు ప్రభుత్వం చూపెడుతూన్న సాకు కాని నిజమైన కారణం అనుకున్నావేమిటి? సోషలిస్టుపార్టీ కార్యవర్గం కలుసుకునేందుకు వీల్లేదన్నది ప్రభుత్వం...ఏం...కార్యనిర్వాహకవర్గంలో ముస్లింలుహిందువులు నరుక్కుంటారా..."

"మరీ...ప్రభుత్వంమీ సభలు నిషేధించిందికదా......మీరేమి చెయ్యదలచుకున్నారు...అనేక వందల మైళ్ళ దూరం నుంచి డబ్బు ఖర్చుపెట్టుకొచ్చారే!"

ట్రాంలో వెడుతూంటే కోటిని ఎవరో ప్రశ్నించారు. కోటి మాట్లాడలేదు. మళ్లీ ఆయనే అంటున్నారు..."నన్నడిగితే... మీరు జరిపేది ఎక్కడ......కాంగార్ మైదానంలోకదూ...మహాసభ జరిపి తీరతామని చెప్పండి ప్రభుత్వంతో......జరపండి...పోలీసులుమిమ్మల్నే మిచేస్తారు... బొంబాయిప్రభుత్వం అంటే ప్రజలకికోపం పీకదాకావుంది...మీరు నిషేధాన్ని ధిక్కరించండి! బొంబాయి ప్రజలకు మార్గం చూపించండి!" ట్రాంబండ్లు, కార్లు వీధులన్నిటినీ ప్రతిధ్వనింప చేస్తున్నాయి. ఈ సంభాషణ అవికూడా వింటున్నాయని పించింది. కలవరపడుతున్నట్టనిపించింది.

"రేపుసాయంకాలం నాలుగు గంటలకు విద్యార్థులు పౌరసత్వ హక్కులకోసం పోరాడుతున్నారు!"

"కాంగార్ మైదాన్ చలో!"

"పోలీసులు మహాసభ మైదానం పెండాలు ఆక్రమించారు తెలుసా"

"కాంగార్ మైదాన్ చలో!"

ఎవరిని ఏ ప్రశ్న అడిగినా సమాధానం ఒకటే...

"కాంగార్ మైదాన్ చలో!"

విద్యార్థు లందరికీ తాముబహిరంగంగా జరపబోయే విషయం......ప్లాను అంతా తెలుసు...నాలుగు గంటలకి సాయంత్రం నిషేధాన్ని ధిక్కరించాలి! పోలీసుల్ని అడ్డి...పోరాడి...కాంగార్ మైదాన్ ప్రవేశించాలి.

మధ్యాహ్నం రెండుగంటలకే విద్యార్థులు మైదానంముందు పరేల్ స్టేషన్ దగ్గర చేరారు. ఎదురుగుండా 'పదకొండవ ఆలిండియా స్టూడెంట్సు ఫెడరేషన్ కాన్ఫరెన్స్' అని ఎర్రబేనర్ గాలికి ఊగుతోంది ఉత్సాహంగా.

"జరిపి తీరుతాం!" అన్నాయి పదమూడువందల విద్యార్థికంఠాలు.

"మీరు మేంతోడు" అన్నారు వేలకొద్దీ బొంబాయివాసులు!

"పోలీసులు టియర్ గాస్ వాడితే, ఇదిగో నీళ్లతో మేంసిద్ధం..." అన్నారు బొంబాయి గృహిణులు!

"షేమ్... షేమ్... హోమ్ మినిస్టర్"

"బొంబాయి ప్రభుత్వానికే సిగ్గు..."

పోలీసు లారీలు దిగుతున్నాయి... తెల్లటోపీలతో మొలలో రివాల్వర్ల ఆఫీసర్లు...

"పోలీస్ జులుం నశించాలి..."

"పోలీస్ రాక్షసులు వెంటనే ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలి..."

విద్యార్థినులు నీళ్ళలో గుడ్డలుముంచి చుట్టూ అందరికీ పంచిపెడుతున్నారు.

నాలుగు సమీపిస్తోంది!

"వీళ్ళిప్పుడు ఏం చెయ్యబోతున్నారూ...!"

"???"

"అరఫర్లాంగు దూరంలో వుంది మైదాన్...చుట్టూ......అంతా పోలీసు దళాలు...ఎలా చేరుతారు ప్రదేశాన్ని...."

నాలుగు అయింది!!!

ఎక్కడనుంచి వచ్చిందో సిగ్నల్... ఎవరిచ్చారో...నాకు యీనాటికీ తెలియదు... అంతా అద్భుతంగా వుంది.

అంతే!

కాంగార్ మైదాన్ చలో......

గబగబ మైదాన్‌వైపు పరుగెత్తారు విద్యార్థులూ......పౌరులూ......కనుతీసి నూరుసెల్లోపల పెరేల్‌ట్రాం స్టేషనులో ఒక్క మనిషి లేడు...కాంగార్ మైదాన్ రోడ్ మీద వేలమంది పరుగెడుతున్నారు!

పోలీసులు నివ్వెరపోయారు. .విద్యార్థి వీరులకి లాఠీలందించారు .బలుసాకుకోసం పరుగెత్తారు...

మైదాన్ చేరువయింది...పోలీసు ఆఫీసర్ రివాల్వర్ పేల్చాడు...పడిపోయారు ఒకరో యిద్దరో. లాభం లేకపోయింది... విద్యార్థులు ప్రవేశించారు మైదాన్‌లో! పెండాల్ ఆక్రమించారు!

వందలు విద్యార్థులూ...ప్రజలూ... పెండాల్‌లో చేరారు...

కోటి ఉద్రేకంగా నినాదాలు ఇస్తున్నాడు.

"బొంబాయి ప్రభుత్వ కిరాతకవర్గాలు నశించాలి!"

"మురార్జీదేశాయ్ ఖబడ్‌దార్! ఎ. ఐ. యస్. యఫ్. హై తయార్!" ఇంకా ఇంకా గొంతెత్తి అరుస్తున్నాడు.

ప్లాట్‌ఫారం మీద విద్యార్థి నాయకులూ ఎంతోమంది విద్యార్థులూ విద్యార్థినులూ—చుట్టూ వందలకొద్దీ విద్యార్థులూ—విద్యార్థినులూ--పౌరజనులూ—ఎదురుగుండా దూరంగా పోలీసులు-పటాలాలు—ముఖాలకి టియర్‌గాస్ నుంచి రక్షించుకునేందుకు తొడుగులతో!

కార్యదర్శి మాట్లాడటం ప్రారంభించారు:

"ఈనాడు బొంబాయి పౌరులకు రాక్షసులనుంచి పౌరసత్వాలు సంపాదించుకోవడం నేర్పాం—మహాసభ జరిపి తీరు

తాం — ఈవేళటి మహాసభకు బొంబాయి పౌరులు ప్రముఖులందరి ఆశీర్వచనాలొ వున్నాయి. కార్మిక నాయకులు శ్రీ యస్. యమ్. జోషీ ఆశీర్వదించారు. ప్రఖ్యాత పండితులు పటేల్ ఆశీర్వదించారు. ఈవేళ సమావేశానికి బొంబాయి విద్యార్థి యూనియన్ కార్యదర్శి సుశీలా మదీమన్ అధ్యక్షత వహిస్తుంది—"

వందలవేల కరతాళ ధ్వనులతో సుశీలా అధ్యక్షత వహించింది. ఎన్నో కెమేరాలు 'క్లిక్' మన్నాయి. ప్రెస్ రిపోర్టర్లు, తీసిన ఫొటో తీయకుండా, ఫిలింరీల్సు ఖాళీ చేస్తున్నారు. పోలీసులు పిచ్చిఎత్తినట్లు అరుస్తున్నారు; విభ్రాంతులౌతున్నారు.

తీర్మానం ప్రవేశపెట్టబడింది!

"— బొంబాయి ప్రభుత్వ చర్యని ఖండిస్తూ..."

అంగీకరించబడింది ఏకగ్రీవంగా...

బొంబాయి పోలీసుచర్యను ఖండిస్తూ తీర్మానం ప్రవేశపెట్టబడింది....ఏకగ్రీవంగా అంగీ..."టియర్ గాస్..."

ధన్...ధన్...ధన్...

టియర్ గాస్ పెండాలంతాక మ్మేసింది.

పొగ...మంట...విద్యార్థులు, విద్యార్థినులు స్పృహతప్పి పడిపోయారు...

పొగలో పోలీసువీరుడు తుపాకీ కాలుస్తున్నాడు!

చాలమంది జాగ్రత్తగా రక్షణస్థలాలు చేరుకున్నారు.

నీళ్లుబిందెలతో ..నాలు గంతస్థులపై నుంచి...కురిసిపోతున్నాయి...కాంగార్ మైదాన్ చుట్టూ బొంబాయి స్త్రీలు అమృతవర్షం కురిపిస్తున్నారు. కడవలు ప్రయుమ్మరిస్తున్నారు.

"సామ్రాజ్య వాదులతో చాలసార్లు పోరాడేం ఈ విధంగా ఇదేస్థలంలో"... అంటోంది ఒకామె నాతో.

"మళ్లీ ఆక్రమిస్తాం మైదాన్"

ముందుకు పోతున్నారు పోలీసుకు రొమ్ములొగ్గి—

మళ్లీ టియర్ గాస్ — తుపాకి కాల్పులు.

కళ్లు మండిపోతూ ఎవరింట్లోకో చేరుకున్నాను. కోటిఏమయ్యాడో తెలియదు— ఇంకాఇంకా చాలామంది—

గదిలో స్పృహ తెలిసీ తెలియకుండా పడుకున్నాను— ఎవరో వచ్చి గదిలో అంటున్నారు—"మనంవిజయంపొందాం— ప్రభుత్వంకాదు. యువకులు గెలిచారు!"

"మన మహాసభ మైదాన్‌లో జరుపుకున్నాం—కార్యనిర్వాహకవర్గం—విద్యార్థి ప్రతినిధులు ఎవరి కేంపులకు వాళ్లు వెళ్లాలని కోరుతోంది—"

"1942 దృశ్యాలు మళ్లా పట్టణంలో జరిగాయి!"

"బొంబాయిప్రభుత్వ దారుణచర్యలు!"

"మురార్జీ దేశాయి కఠినహృదయం!"

పేపర్లెన్నో బేనర్ హెడ్డింగులతో విద్యార్థులను హర్షించాయి.

కోటికి దెబ్బలుతగిలాయి ఆసుపత్రిలో వున్నాడు—

ఆసుపత్రిలో కోటితో నేనుచూసిందంతా చెప్పాను.

మూలుగుతూ అన్నాడు—"నువ్వు చూసింది చాలా తక్కువ పోరాటం—నేను—తర్వాత చెప్తాను—" నీరసంగా కళ్లుమూశాడు.

మధ్యాహ్నం ఒంటిగంటకు బొంబాయి మద్రాస్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది—తనదేమీ పోనట్లుగా...

రైలులో ముసలితాత అన్న మాటలు మళ్లీమళ్లీ జ్ఞాపకానికొస్తున్నాయి—

"మేము మా చిన్నతనంలోనూ ఇలాగే పోరాడేం బ్రిటిష్ తుపాకులకి ఎదురుగా—ఈనాడు నా స్నేహితుడిమీద మీరు దెబ్బలాడేరు—నేనేమీ విచారపడడంలేదు. శత్రువు ఎవరైనా బుద్ధి చెప్పాల్సిందే—నేను వీళ్లతో విసిగి రాజకీయాలు వదలుకున్నాను. మీరు యువకులు—ముందుకు తీసుకుపోండి అపజైత స్వాతంత్ర్యజండాని—మీ విద్యార్థి సంఘానికి నా ఆశీర్వచనములు !!"

విద్యార్థి జండా బొంబాయి గాలిలో రెపరెపలాడుతూ గర్వంగా మీకు స్వాతంత్ర్యాన్నీ శాంతినీ అభ్యుదయాన్నీ ఇచ్చి తీరతానని విద్యార్థులకు హామీ ఇస్తోంది!

"విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం యీ మహాసభలు" తల మీద గాయం నిమురుకుంటూ గర్వంగా అన్నాడు కోటి!

మధ్యాహ్నపు ఎండనీ—దక్కను పీఠభూమినీ చీల్చుకొని వడిగా వడివడిగా అనేక వందల విద్యార్థివీరులనూ ప్రజలనూ మోసుకొని మద్రాస్ ఎక్స్‌ప్రెస్ విసురుగా సాగిపోతోంది!

## ఓ నాజీ నైజాం

నీ వింకా అంధుడవేనా ?
భావికాలగతి ఏమో
పరికించక, నీవారల
మధ్యయుగపు చరిత్రలే
మననంచేస్తూ, నాజీ
నరహంతక పరిపాలన
ఎన్నాళ్ళిక చేద్దామని...
— నీవింకా అంధుడవు!

నీ గాజుకళ్ళ కనుపడవో
కరకుగుండె పోలీసులు
అరబ్బులు గూండాలు చేయు
చెప్ప నోరురాని పనులు:

* * *

శ్రీ పల్లా రామకోటయ్య

శిశుహత్యలు, దోపిడీలు,
స్త్రీల మానభంగాలు
చెరలు, గ్రామదహనాలు
—ఒకటేమిటి ? నాజీ...

ఇకనైనా మేలుకొనుము
ఇది స్వాతంత్ర్యయుగం
ఇది ప్రజాతంత్రయుగం!
ఇక్కడ నీ నిరంకుశత్వం
నిలిచేందుకు తావులేదు!
తావులేదు! కాదంటే—
ప్రజాగ్రహమున
కాహుతియై పోతావు!